ఎంఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) (ఆల్ స్పెషలైజేషన్స్) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎల్ఎల్ఎం పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎల్ఎల్ఎం కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం (సీబీసీఎస్), ఎల్ఎల్ఎం (నాన్ సీబీసీఎస్) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) క్లాస్‌రూం బ్లాక్‌లో ఈనెల 24న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు.

పార్కు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సుందరయ్య పార్కులో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 21: ముషీరాబాద్ నియోజకవర్గలో పరిధిలో ఉన్న పార్కులను అన్ని విధాలు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోనున్నట్టు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కును శుక్రవారం ఆయన సందర్శించారు. ఆధునికరించిన టాయిలెట్స్‌ను స్థానిక కార్పొరేటర్ రవిచారితో కలిసి ఎమ్మె ల్యే ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. సుందరయ్య పార్కును వాకర్స్, సందర్శకులు సేదతీరే విధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహా, సీనియర్ నాయకుడు బబ్లూ, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వివేక్, బి.వెంకట్‌స్వామిగౌడ్, రమేశ్‌రెడ్డి, నాగభూషణం, జయదేవ్, జనార్దన్, శైలజ, కృష్ణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్, నవంబర్ 22: ఆరోగ్యం విషయంలో ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బేగంపేట్, రాంగోపాల్‌పేట్ డివిజన్లకు చెందిన 7మంది లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.75 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదైనా ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తితే ఆశ్రద్ధ చేయకుండా అవసరమైన ఆర్థిక సహాయం కోసం సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాంతో అవసరమైన మెరుగైన చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ, నాయకులు కిషోర్‌కుమార్, ఆంజనేయులు, శేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

సీవరేజీ లైన్ పనులు ప్రారంభం

కింది బస్తీలో సీవరేజీ లైన్ పనులను అధికారులతో కలిసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్

సికింద్రాబాద్, నవంబర్ 22: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ సూచించారు. డివిజన్ పరిధిలోని చిలకలగూడ కింది బస్తీలో సీవరేజీ లైన్ పనులను అధికారులు, నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూ.1.7 లక్షల వ్యయంతో పనులు చెప్పట్టినట్టు తెలిపారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కుషాల్, బీఆర్ఎస్ నాయకులు సాయియాదవ్, మస్తాన్, వెంకట్, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి డబుల్ బెడ్రూంల వద్ద వాటర్‌లైన్ పనులు జరుగుతుండగా వాటర్ లైన్ డ్యామేజ్ కావడంతో అధికారులతో కలిసి కార్పొరేటర్ హేమ పరిశీలించారు. త్వరగా చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. శ్రీనివాస్‌నగర్‌లోని పర్యటించారు. మోహన్‌రెడ్డినగర్‌లో రూ.19 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ నిర్మాణ పనులను పరిశీలించారు. రెడ్‌క్రాస్ హాస్పిటల్ పక్కన ఉన్న పార్కును తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏఈ కౌశిక్, వాటర్‌వర్క్స్ మేనేజర్ నవ్య, కుషాల్, హార్టికల్చల్ సుపర్‌వైజర్ సురేశ్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

బన్సీలాల్‌పేట్, నవంబర్ 22: కళాశాలలో ర్యాగింగ్ నిరోధించడానికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్ఎంసీ రూపొందించిన యాంటి ర్యాగింగ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటి కార్యదర్శి, జస్టిస్ అరుణకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో యాంటి ర్యాగింగ్ యాక్ట్ గురించి అవగాహనా శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేండ్లు కష్టపడి చదువుకున్న విద్యార్థులు జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడితే, చట్ట ప్రకారం శిక్ష పడుతుందని, అప్పుడు వారి జీవితం, భవిష్యత్తు వృథా అవుతుందని గుర్తించాలని అన్నారు. డ్రగ్స్ లాంటి వ్యసనాలకు బానిసలు కావొద్దని, వాటికి దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వాడినా, విక్రయించినా పోలీసులకు లేదా కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర మాట్లాడుతూ ఢిల్లీలోని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు యాంటి ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశామని, విద్యార్థులు తమ పేరు చెప్పకుండా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. యాంటి ర్యాగింగ్ యాక్ట్ అనుసరించి కాలేజీలో ర్యాగింగ్ చేయడం, డ్రగ్స్ వాడడం లాంటి దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఐదేండ్ల పాటు చదువుకునే విద్యార్థులకు గాంధీ వైద్య కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో కష్టపడి చదివి, మెరిట్ సాధించి ఇక్కడ సీటు సంపాదించుకున్న పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించడానికి వస్తారని, వారితో స్నేహంగా ఉండి ఆదర్శంగా నిలవాలని సీనియర్లను కోరారు. విద్యార్థులకు ఏదైనా మానసిక సమస్య ఉంటే తాము కౌన్సిలింగ్ ఇస్తామని ఆమె తెలిపారు. గాంధీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.వాల్యా, డాక్టర్ రవిశేఖర్‌రావు, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి, ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ కృపాల్‌సింగ్, అనస్థీషియా సహాయ ప్రొఫెసర్ డాక్టర్ సంగీత, వార్డెన్ డాక్టర్ వినోద్, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్‌గౌడ్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారులు భద్రతా చర్యలు పాటించాలి

బేగంపేట్: సికింద్రాబాద్ మహంకాళి డివిజన్ పరిధిలోని బంగారం, వస్త్ర వ్యాపారులతో ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాల్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం సోమసుందరం వీధిలోని విశ్వకర్మ భవనంలో నిర్వహించిన సమావేశంలో మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్, మహంకాళి, మార్కెట్, రాంగోపాల్‌పేట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు రాఘవేంద్ర, పరశురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వ్యాపార సముదాయాల వద్ద శిక్షణ పొందిన సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ప్రతిఒక్కరు దుకాణం వద్ద సీసీ కెమారాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైం, సోషల్ మీడియా ప్రభావాల గురించి అవగాహన కలిగించారు. ఫైర్ సేఫ్టీ మెజర్‌మెంట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

చెత్త సేకరణ బృందాలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, నవంబర్ 22: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం ఆమె జీహెచ్ఎంసీ అధికారులు, చెత్త సేకరణ బృందాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేని సేవలను పారిశుధ్య సిబ్బంది అందించాలని సూచించారు. అంతేకాకుండా నివాసితుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయరాదని ఆమె కోరారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాస రావు జన్మదినాన్ని పుర స్కరించుకొని అడిక్‌మెట్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నేత రాంపాల్ దేవ్‌డా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేత శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, సయ్యద్ అస్లాం, నందు, వెంకట్‌రామ్‌రెడ్డి, ఇసాక్, రఘు, మాణిక్‌ప్రభు, ప్రకాశ్‌దేవ్‌డా తదితరులు పాల్గొన్నారు. – **ముషీరాబాద్, నవంబర్ 22:**

క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం

క్రిస్మస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 5న సనత్‌నగర్ వెల్ఫేర్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రీక్రిస్మస్ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ అసోసియేషన్ అధ్యక్షుడు విలియమ్స్ శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ వేడుకలను పురస్కరించుకుని క్రీస్తు సందేశాన్ని వినిపించేందుకు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారన్ విచ్చేస్తున్నారని అధ్యక్షుడు విలియమ్స్ ఎమ్మెల్యేకు వివరించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తనను కలిసిన యూసీడబ్ల్యూఏ ప్రతినిధులు దయాకర్, సైమన్‌రాజ్, ఉదయ్ డేవిడ్, ప్రణయ్‌కు ఎమ్మెల్యే సూచించారు. – **అమీర్‌పేట్**

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

బొల్లారం త్రిశూల్ పార్కు ప్రభుత్వ పాఠశాలలో నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

బొల్లారం, నవంబర్ 22: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం త్రిశూల్ పార్కు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్-సికింద్రాబాద్ జనహిత సేవా ట్రస్ట్, ఆనంద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్, సికింద్రాబాద్ అధ్యక్షురాలు మంజు, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ ఎస్.రామచంద్ర, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నందకుమార్, నర్సింగరావు, ప్రధానోపాధ్యాయుడు విక్రమాదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బౌద్ధనగర్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంది శైలజ పిలుపునిచ్చారు. పోలింగ్ స్టేషన్లలో రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 22: కాలేజీకి వెళ్లిన విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సాయిబాబానగర్‌కు చెందిన లూసీ ఈనెల 20న ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. కుటుంబ సభ్యులు మైలార్‌దేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 22: టీఎస్ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ మదర్ డైరీ, ఎల్ఎన్ నగర్, మూన్ కేఫ్, టూరిస్టు హోటల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మదర్‌డైరీ, ఎల్ఎన్ నగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్ ఎక్స్, మదర్ హైస్కూల్, లక్ష్మమ్మ పార్కు, వారాసిగూడ, ఎల్ఎన్ నగర్, అంబర్‌నగర్, అశోక్ నాలా, పుల్లయ్య బావి పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 వరకు మూన్ కేఫ్, టూరిస్టు హోటల్ ఫీడర్ల పధిలోని శ్రీరాంనగర్, అచ్చయ్యనగర్, మూన్ కేఫ్, హెరిటేజ్, టూరిస్టుహోటల్, చెప్పల్‌బజార్, బజాజ్ షోరూం, కాచిగూడ మెయిన్ రోడ్, కుత్బిగూడ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

లష్కర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, నవంబర్ 22: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా నేడు (శనివారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. బన్సీలాల్‌పేట్, క్లాక్‌టవర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం విధిస్తున్నట్టు చెప్పారు. హైదర్‌బస్తీ ఫీడర్ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హైదర్‌బస్తీ, డిజిటల్ రోడ్డు, సత్యనారాయణ టెంపుల్, ఆంధ్రా బ్యాంక్ లైన్, ట్రాఫిక్ పీఎస్ లైన్, రాష్ట్రపతి రోడ్డు మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే కేవీ వైస్రాయ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైస్రాయ్, జీరాక్లబ్ అండ్ గార్డెన్ ఏరియా, అన్నా విశ్వం తంతో పాటు ఆర్పీ రోడ్డు ఫీడర్ పరిధిలోని రాష్ట్రపతి రోడ్డు ఏరియాలో కూడా విద్యుత్ నిలిపివేయనున్నట్టు సంబంధిత అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

వికసిత్ భారత్ క్విజ్‌లో యువత పాల్గొనాలి

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పోస్టర్లను విడుదల చేసిన క్రీడాకారులు, ఎన్‌వైకే, ఎస్ఎఐ అధికారులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 22: జాతీయాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కోసం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పేరుతో కేంద్ర ప్రభుత్వ 2025 జనవరిలో నిర్వహించే యువజనోత్సవాలకు దరఖాస్తు చేసుకోవాలని నెహ్రూయువ కేంద్ర సంఘటన్, తెలంగాణ డైరెక్టర్ ఎ.ఆర్.విజయారావు అన్నారు. శుక్రవారం కవాడిగూడ సీజీఓ టవర్స్‌లోని పీఐబీ సెమినార్ హాల్లో ఎన్‌వైకేఎస్, భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఎఐ)లు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ ఛాలెంజ్ అనేది టాలెంట్‌తో కూడిన జాతీయ స్థాయి డిజిటల్ క్విజ్ పోటీలని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 5వరకు జరుగుతుందని, ఇది నాలుగు అంచెలలో ఉంటుందని, 15 నుంచి 29 ఏండ్ల వయస్సు గల యువత పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. mybharat.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన మూడు వేల మంది యువ లీడర్లు ప్రధానితో నేరుగా మాట్లాడేందుకు అద్భుతమైన అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి కుష్బూగుప్తా మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదం పొందిన నవంబర్ 26న ఎన్‌వైకే ఆధ్వర్యంలో సచివాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే, నవంబర్ 25 నుంచి 30 వరకు నగరంలోని కోఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కాశ్మీరీ యూత్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని, ఇందులో కశ్మీర్‌లోయ నుంచి వచ్చిన 132 మంది యువత పాల్గొంటారని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుంటారని ఆమె తెలిపారు. సమావేశంలో అర్జున అవార్డు గ్రహీత ముఖేశ్ కుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎన్.రమేశ్, క్రీడాకారిణి నందిని, ఎస్ఐఏ సహాయ డైరెక్టర్ నిషా విద్యార్థి, అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం

ముషీరాబాద్, నవంబర్ 22: బీఆర్ఎస్ గ్రేటర్ నేత, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ముషీరాబాద్ నాగదేవత ఆలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారభించారు. అంతకు ముందు ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఠా జయసింహా, శ్రీధర్‌రెడ్డి, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎయిర్‌టెల్ రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

అడ్డగుట్ట, నవంబర్ 22: మద్యం మత్తులో పెద్దనాన్నపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట ఆర్ఆర్‌సీ మైదానం సమీపంలోని వడ్డెర బస్తీ ప్రాంతానికి చెందిన బుచ్చమ్మ(45)కు మల్లిఖార్జున్(27), రాకేశ్(22) ఇద్దరు కుమారులు. వీరిద్దరు రాణిగంజ్‌లోని హార్డ్‌వేర్ దుకాణంలో పని చేస్తుంటారు. అయితే మల్లిఖార్జున్ వాళ్ల బాబాయి రాజు ఇటీవల మరణించాడు. అతడి దశదిన కర్మను ఈనెల 21వ తేదీన ఇంటి వద్ద చేయగా.. అందరూ మద్యాన్ని తాగారు. అదే సమయంలో మల్లిఖార్జున్ కుటుంబసభ్యులతో గొడవ పడ్డాడు. దీంతో ఆపేందుకు వారి మధ్యలో వెళ్లిన తన పెద్దనాన్న అయిన శ్రీనివాస్(60)పై పక్కనే ఉన్న బ్లేడ్‌తో పొట్ట, చేతిపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా 50 కుట్లు పడినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన మల్లిఖార్జున్‌తో పాటు రాకేశ్, బుచ్చమ్మలపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయం సిద్ధం

చిక్కడపల్లి, నవంబర్ 22: చిక్కడపల్లి హైదరాబాద్ నగర్ కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయ కార్యదర్శి పద్మజ అన్నారు. నగర గ్రంథాలయంలో చదువుకున్న జి.గణేశ్ కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రంథాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటేశ్‌యాదవ్, సుకేశ్‌కుమార్, అవినాశ్ పాల్గొన్నారు.

ఆలీనగర్‌లో యువతి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆలీనగర్‌కు చెందిన లక్ష్మిదుర్గాభవాని కంపెనీలో కార్మికురాలిగా పని చేస్తుంది. 21న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ డి.రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. దీంతో పాటు ఎస్టేట్ సెల్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా సైతం ఆయననే నియమించారు. ఓయూలోని యూజీసీ-మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ విజయ్‌కుమార్ నియమితులయ్యారు. వారికి ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ నియామక పత్రాలు అందజేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొ.రాజశేఖర్‌రెడ్డి గతంలో హాస్టల్ వార్డెన్, ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రొ.విజయ్‌కుమార్ కెమిస్ట్రీ విభాగానికి చెందినవారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **Mrs. M.Sukeshini, W/o. Mr. B.